

# ఎన్నారై ముచ్చట్లు

## –సత్యం మందపాటి



### (గతసంచిక తరువాయి)

## ౨. ఏఐ – ఎన్నెస్

1960 దశాబ్దం మొదట్లో గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కాకినాడలో బి.ఇ. చదివేటప్పుడు మా ప్రొఫెసర్‌గారు చెప్పిన ఒక విషయం నాకెప్పుడూ గుర్తొస్తూనే వుంటుంది.

“మనిషి తను కనిపెట్టి తయారుచేసుకున్న యంత్రాలకు తనే బానిసైపోతున్నాడు” అన్నారాయన.

ఆరోజుల్లో ఇప్పటిలా స్మార్ట్ ఫోనులూ, ఐపాడ్లూ, టాబ్లెట్స్, సోషల్ మీడియాలు, ఇంకా ఎన్నో ఇతర యాంత్రిక జీవనంలో మనల్ని కట్టి పడేసేవి ఏవీ లేవు. ఆయన ఆ మాట ఆ రోజుల్లోనే అన్నారంటే, ఆనాటి గురువులు మనకి చదువేకాక, ఎంత ముందు చూపు ఆలోచనలు చేసి, అవీ పాఠాల్లో భాగంగా ఎలా చెప్పేవారో తెలుస్తున్నది.

ఇందాకే ఒక కార్టూన్ కూడా చూశాను. దానిలో గాంధీగారి మూడు కోతుల సరసన, ఇంకొక నాలుగో కోతి కూడా వుంది. మూడు కోతులూ చెడు చూడకు, చెడు వినకు, చెడు చెప్పకు అని చెబుతుంటే, నాలుగో కోతి తన సెల్‌ఫోన్ చూసుకుంటూ అంటున్నది, ‘నేను చెడే కాదు, ఏదీ వినను. ఏదీ చూడను. ఏదీ చెప్పను. నా జీవితం నాదే’ అని! ఈ చక్కటి ఉదాహరణ చాలు సాటి మానవమాత్రులకు దూరమైపోయి, మన యంత్రాలకు మనమే ఎంతో బానిసలైపోయామో!

ఎవరింటికైనా వెడితే ముందుగా “బాగున్నారా?” అని ఆరోజుల్లో అడిగే వాళ్ళం. ఇప్పుడు “మీ వైఫై ఏమిటండీ” అని అడుగుతున్నాం.

వారాంతం పార్టీల్లో కూడా నాయుడు–రెడ్డి, డెమోక్రాట్–రిపబ్లికన్ వాదనలు తగ్గి, భోజనాలు పెట్టేదాకానూ తర్వాతా వారి వారి సెల్‌ఫోన్లలో మునిగిపోతున్నారు చాలామంది.

ఇంకో కార్టూన్‌లో ఒక చల్లటి సాయంత్రం అమ్మా, నాన్నా, కూతురూ, కొడుకూ సోఫాల్లో ఎదురెదురుగా కూర్చుని ఎవరి యంత్రాల దొరలతో వాళ్ళు– అమ్మ మనిషిగా బ్రతకటం ఎలా అనే ప్రవచనాలు వింటూ, నాన్న ప్రపంచ రాజకీయాలకు లైకులు పెడుతూ, కూతురు సుడోకూ ఆడుకుంటూ, కొడుకు చెవులు బ్రద్దలయే యాసిడ్ రాక్ పాటలు

వింటూ స్వయంతృప్తి పొందుతున్నారు. అమ్మ iPad, కూతురు iPhone, కొడుకు iPod చూస్తుంటే, తండ్రి పైకే అనుకుంటున్నాడు వీటన్నికీ ఐ పైడ్ అని.

శ్రీశ్రీగారన్నట్టు వస్తున్నాయొస్తున్నాయని ముప్ఫై ఏళ్ళ క్రితమే సాఫ్ట్వేర్ ఉద్యోగాలు జగన్నాథ రథచక్రాల్లా వచ్చేశాయి. ఇక అందరూ కళ్ళింతింత చేసుకుని ఆన్లయినంటూ కంప్యూటర్లకు అంకితమైపోయారు. కొందరు ఎంతో కష్టపడి న్యూ ప్రాడక్ట్ డెవలప్మెంట్‌కి కోడ్ వ్రాస్తూ పనిచేస్తుంటే, ఎందరో ఇండియాలో సాఫ్ట్వేర్ కంపెనీలతో అర్థరాత్రీ అపరాత్రీ ఫోన్ చేసుకుంటూ ప్రాజెక్ట్ మేనేజ్మెంట్ చేస్తున్నారు.

ఇప్పుడు వచ్చేశానొచ్చేశానంటూ వచ్చేసింది ఏ.ఐ.

ఏ.ఐ. అంటే ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్. అంటే కృత్రిమ మేధస్సు.

అంటే 'అసలు' మేధస్సు వున్నవాళ్ళు 'సిసలు' మేధస్సుని తయారు చేయటమన్నమాట. సాఫ్ట్వేర్లో నాకు అంత మేధస్సు లేదు కనుక, నేను మెకానికల్ ఇంజనీరుని కనుకా, నా భాషలో అది 'పండిత పుత్రః పరమ శుంఠః' అయుంటుందేమో అనుకున్నానుగానీ, అది కాదుష! మరేమిటట?

ఈమధ్య ఒక ఏఐ విద్వాంసుడిని అదే అడిగాను.

"పండితులు, శుంఠా, గింఠా... అలాటిదేం కాదు. మనం కనిపెట్టే యంత్రాలకే, సాఫ్ట్వేరుకే మనం ఎక్కువ 'తెలివితేటలు' ఇవ్వటం వల్ల, అవి మనకన్నా ఎంతో వేగంగా పని చేయటం, ఏమీ తప్పులు లేకుండా చేయటం వంటి లాభాలు ఎన్నో వుంటాయి" అన్నాడు.

'మరి నష్టాలో?' అని అడిగాను.

అతనికి నేను రచయితనని తెలుసు.

'కవి కాంచనిచో, మన ఏ.ఐ. కాంచును' అని చటుక్కున చెప్పేశాడు.

"అంటే?" అడిగాను అమాయకంగా.

"అంటే ఇక రచయితలతో పనుండదు. కావలసిన కథా వస్తువు, చిరు కథనం చెప్పేసి, నాకు తెలుగులో ఒక కథ వ్రాసి పెట్టమ్మా, స్వాతి పత్రిక కథల పోటీకో, కౌముది పత్రిక పుట్టినరోజు సంచికకో పంపించాలి అని మీరు చాట్ డీపీటీకో, కోపైలట్‌కో చెప్పేస్తే చాలు" అన్నాడు ఆ ఏఐ విద్వాంసుడు మిత్రా.

నాకు అసలే అనుమానాలు ఎక్కువ. "చెబితే?" అన్నాను.

"ముందు చెప్పవయ్యా చెలమయ్యా. నువ్వే చూద్దువుగాని" అన్నాడు నవ్వుతూ.

అతని మాటలు తూచా తప్పకుండా పాటిస్తూ కంప్యూటర్లో చెబుతున్న నా మాటలు ఇంకా పూర్తిగా పూర్తవకుండానే ముప్ఫై సెకండ్లలో నాలుగు పేజీల కథ వ్రాసేసి, 'ఒకసారి చదువుకో, ఏమన్నా మార్పులు కావాలంటే చేసిపెడతాను' అన్నాడు మా కోపైలట్.

‘అంతేకాదు నీ కథకి ఒక బొమ్మ కావాలంటే వేసిపెడతాను. కావాలా? దీన్నే ఒక నవలలా చేయమంటే చేస్తాను, కావాలా? ఇంగ్లీషులోకో, ఇథియోపియా భాషలోకో అనువాదం చేయమంటే అదీ చేస్తాను. కావాలా?” అన్నాడు కోపైలట్, మాయాబజార్ సినిమాలో ఘటోత్కజుడి శిష్యుడు చిన్నమయ్య పాత్రలో రమణారెడ్డిగారిలా.

కథని చాలవరకూ నేను వ్రాసినట్టే వ్రాశాడు కోపైలట్. చిన్న చిన్న మార్పులు చేస్తే సరిపోతుంది. కోపైలట్టే ఇంత బాగా వ్రాస్తే, పైలట్ అయితే మరెంత బాగా వ్రాస్తాడో అనుకున్నాను. ఇలా అయితే ఆరు దశాబ్దాలుగా కథలు వ్రాస్తున్న నేను ఇక వ్రాయటం పూర్తిగా మానేయాలేమో! ‘హతవిధీ!’ అనుకున్నాను.

“ఏఐ ఇంకా ఏమి కాంచును?” అని అడిగాను మా ఏఐ విద్వాంసుడిని.

“ఇప్పుడు నువ్వనుకున్న కథ ఏఐ వ్రాసేస్తే నీ మనసులో ఏమనుకున్నావు?” అడిగాడు మిత్రా.

“ఇక నా పాఠకులకి నేను అనవసరం అని” అన్నాను కుసింత విరహ బాధ అనుభవిస్తూ.

“అది జరిగే అవకాశాలు లేకపోలేదు. అన్ని రంగాల్లోనూ ఉద్యోగాలు పోతాయని చెప్పలేనుగానీ, తగ్గిపోయే అవకాశాలున్నాయి” అన్నాడు.

“ఎలా?” అడిగాను.

“మొన్న ఒక డ్రైవర్‌లెస్ కారు దానంతట అదే రోడ్డు మీద వెడుతుంటే మనం చూశాం. అంటే డ్రైవర్ ఉద్యోగాలు గోవిందా. నిన్న మనం లంచికి వెళ్ళినప్పుడు సర్వారాయుడు మన దగ్గరకు వచ్చి ఆర్డర్ తీసుకున్నాడా? లేదు. టేబుల్ మీద వున్న క్యూఆర్ కోడ్ చూసి మనం మన ఫోన్లోనే ఆర్డర్ చేశాం. మరి నీకు ఊతప్పం, నాకు మసాలా దోశ తెచ్చింది ఎవరు? బీప్ బీప్ అంటూ వచ్చిన ఒక రోబాట్. మరి సర్వారాయుడి ఉద్యోగం ఏమైంది? గోవిందా గోవిందా అంటూ సర్వేశ్వరుడి దగ్గరకు వెడుతూ ఆ ఏడు కొండల్లో ఒక కొండెక్కింది”

అవును. మా ఆఫీసులో కొన్ని కష్టమైన అసెంబ్లీలు, వెల్డింగ్ స్టేషన్లూ రోబాట్ల చేతుల్లోనే పెట్టాం కదా! కనీసం ఒక ఇరవై ఉద్యోగాలు కొండెక్కాయి కదా!

“అంతే కాదు... ఏఐగాడే మా సాఫ్ట్వేర్లు కూడా వ్రాస్తానంటున్నాడు. అంటున్నాడేమిటి వ్రాస్తున్నాడు కూడాను” అన్నాడు మిత్రా.

“మరి నీ ఉద్యోగం కూడా గోవిందా అవుతుందా” అడిగాను.

“ఇప్పుడు మాత్రం కాదు. ఎప్పుడవుతుందో ఆ గోవిందుడికే తెలియదు. అలాటివన్నీ ఇప్పుడు ఏఐగాడికి మేమే నేర్పిస్తున్నాం”

“అంటే మీ గొయ్యి మీరే తవ్వుకుంటున్నారా” నాకు సత్తె ప్రమాణంగా నిజం తెలీదు కాబట్టే అడిగాను.

“అవుననుకో. కాదనుకో సత్తెం! ఏం జరిగినా జరగొచ్చు” అన్నాడా ఏఐ విద్వాంసుడు ఆరోహణంలోనించీ అవరోహణంలోకి వస్తూ.

‘అవునంటే కాదనిలే, కాదంటే అవుననిలే’ అని కూనిరాగం తీస్తున్నాడు కూడాను.

అప్పుడే నా ఆలోచనలు, నా భుజం తట్టి ఇంకో కోణంనించీ చూడమన్నాయి.

“మా ఆఫీసుల్లో టీమ్ వర్క్ గురించి చెబుతూ ఒక ఉదాహరణ చెప్పేవారు. ఏ ఉద్యోగంలోనైనా అన్ని విషయాల్లోనూ అందరికీ అనుభవం వుండదు కనుక, ఆ ప్రొడక్ట్ డెవలప్మెంటుకిగానీ, అది తయారు చేయటానికి గానీ అవసరమైన అనుభవాలున్న ఒక్కొక్కరినీ మీ టీములో పెట్టుకుంటే త్వరితగతిన ఆ ప్రాజక్ట్ మేనేజ్ చేయటానికి లాభం వుంటుంది అని. అంటే ఎంతోమంది తెలివితేటలు ఉపయోగించుకోమని. మరి పది బుర్రలు కలిస్తే రావణాసురుడిలా అతి తెలివి వస్తుందా?”

“అదే బెండకాయ, వంకాయ, ఉల్లిపాయ, చిలకడదుంప, మునక్కాడ, రామ్ములక్కాయ మొదలైన ఎన్నో రకాల కూరగాయల ముక్కలు కలిపితేనే, మంచి ముక్కల పులుసు తయారయేటట్టు, ఈ ఏఐ కోసం వ్ంతోమంది తెలివితేటలు కలుపుకుంటారన్నమాట” అన్నాడు మా ఏఐ మిత్రా.

బాగుంది, మనకన్నా మనం తయారు చేసేవాటికే ఎక్కువ తెలివితేటలుంటాయన్నమాట!

నిజమైన పుత్రోత్సాహం తండ్రికి పిల్లవాడు పుట్టినప్పుడు కాదుట, పెరిగి పెద్దయి తనకన్నా ఎక్కువ తెలివైనవాడయినప్పుడే అన్నారు కదా మన గదరా సుమతిగారు. శభాష్ ఏఐ!

అప్పుడే ఇంకొక భావన వచ్చింది. దాదాపు ఇరవై ఏళ్ళయిందేమో. విల్ స్మిత్ నటించిన ఒక సినిమా “ఐ రోబాట్” గుర్తుకి వచ్చింది. దానిలో రోబాట్లు అతితెలివితో హత్యలకి పాల్పడతాయి. హీరోనే హతమార్చటానికి ప్రయత్నం చేస్తాయి. అంతే కాదు ప్రాణకోటినే భూమినించి అంతం చేయటానికి ప్రయత్నం చేస్తాయి. మరి ఏఐ అంత భయంకరమైనదా? అదే అన్నాను మిత్రాతో.

ఖంగుమని దగ్గినట్టుగా నవ్వాడు మిత్రుడు మిత్రా.

“ఒక పదునైన కత్తి వుందనుకో. ఉందనుకో ఏమిటి? ఉన్నది. దానితో లేత వంకాయలు సన్నటి ముక్కలుగా కోసి, కుసింత కొత్తిమీర వేసుకుని ఎంతో రుచికరమైన కూర చేసుకోవచ్చు. ఒక సర్జనుడు నీ కాలుని కత్తితో కోసేసి గీసిన గీత కూడా కనపడకుండా సర్జరీ చేయవచ్చు. అలాగే ఒక దుర్జనుడు పిల్లనిచ్చిన మామ వెన్ను మీద ఒకే ఒక వేటు వేసి వేటాడి చంపేసి తనే సింహాసనం ఎక్కవచ్చు. అందుకని ఆ కత్తిని తిట్టుకుంటే ఎలా? ఏది ఏదయినా దాన్ని మన బుద్ధినిబట్టి ఎలా వాడుకుంటే అలా మంచికిగానీ, చెడుకిగానీ వాడుకోవచ్చు. అలాగే ఏఐ కూడాను” అన్నాడు నా మిత్రుడు శుద్ధ బుద్ధానందలా చేయి పైకెత్తి నన్ను దీవిస్తున్నట్టుగా.

మరి ఇంకొక పిచ్చి ప్రశ్న. ఆ తెలివితేటలు యంత్రాలకి ఇచ్చిన మనిషి, వాటికి కావలసిన ఏది మంచి, ఏది చెడు అనే విచక్షణా జ్ఞానం కూడా ఇస్తాడా?

ఎందుకివ్వరు అనుకున్నానుగానీ, ఈరోజుల్లో మనుష్యుల్లోనే ఒకళ్ళ మంచి ఇంకొకళ్ళకి చెడవుతుంటే మరలాటి ఇంగిత జ్ఞానానికి చోటు వున్నదా? వుంటుందా?

ఈమధ్య మా తెనాలి రామకృష్ణని ఎవరో అడిగారుట. ఏఐ అంటే కృత్రిమ మేధస్సు అన్నారు కదా, మరి మూర్ఖత్వాన్ని ఏమంటారు? అని.

అప్పుడు రామకృష్ణ తెనాలినించీ గుంటూరుదాకా వినిపించేటంత పెద్దగా నవ్వి, టివీలో ప్రవచనం చెబుతున్నట్టుగా ఇలా అన్నాడు.

"అవును. చాల మంచి ప్రశ్న అడిగారు. ఈ కృత్రిమ మేధస్సు అనే దాని గురించి కొన్ని వ్యాసాలు మన సైన్సు గ్రంధాల్లోనూ, వార్తాపత్రికల్లోనూ చదువుతున్నాను. నాకు దానివల్ల ఏ ఇబ్బందీ లేదు. కానీ మూర్ఖత్వం కృత్రిమమా అనే ప్రశ్నకు జవాబు ఏమిటంటే, మూర్ఖత్వం అనేది కృత్రిమం కాదు. చాల సహజమైనది. మన చుట్టూ వున్న కొందరు రాజకీయ నాయకుల మాటలనూ, తెలుగు భాషనూ, వారి చేతలనూ, వేలిముద్రల చదువునూ, సంధ్యనూ పరిశీలిస్తే ఆ మూర్ఖత్వం అనేది ఎంత మూర్ఖముగానుండునో ఇట్టే తెలిసిపోతుంది. అలాగే కొందరు ఓటర్లు, కేవలం కుల మత గజ్జితో బరబరా గోక్కుంటూ, ఆ బేధాలనే నమ్ముకుని, సోమపానంతో పొట్టలు నిండుగా నింపుకుని, తమ దేశాన్నే అమ్మకానికి పెడుతున్నఆ వినాశకుల చేతులకు నోట్లకు ఓట్లు అందించటం చూస్తుంటే ఈ మూర్ఖత్వము ఎంత మూర్ఖమైనదో తెలుసుకొనుట కష్టము కానేకాదు. అందుకనే తెలివితేటలు కృత్రిమం అవుతున్నా, ఈ సహజ మూర్ఖత్వం మాత్రం, అనగా నేచురల్ స్టుపిడిటీ ఈ పరిస్థితులు మారేదాకా మారదుకాక మారదు కాక మారదు"

ఈ ఆలోచన వల్లనే ఈ వ్యాసానికి "ఏఐ–ఎన్నెస్" అని పేరు పెట్టింది. మీరు తెలివిగలవాళ్ళు కనుక, ఆ ఎన్నెస్ అంటే ఏమిటో ఇప్పటికే కనిపెట్టేసుంటారు.

ఈమధ్య అంతర్జాలంలో కొన్ని సరదా విషయాలు చూశాక, అవి మీతో పంచుకోవాలనిపించింది.

మనిషికి ఉండవలసింది సహజ మేధస్సా, మైక్రోచిప్పా అని అనుమానం వచ్చిందిట ఒకాయనకు. తనకు సహజ మేధస్సు ఎలాగూ లేదు కనుక, మైక్రోచిప్ అయితే పొటాటో చిప్సులా బయట సూపర్ బజారులో కొనుక్కోవచ్చు అనుకున్నాడని నా అనుమానం.

ఒకప్పుడు 'తెలివి' అంటే మన బుర్రలో వుండే సరుకు. జీవిత పాఠశాలలోని జ్ఞాన సముపార్జన.

మరి ఇప్పుడో? ఒక చిప్పు. మంచి శక్తివంతమైన ఇంటర్నెట్ కనెక్షన్!

కృతిమ మేధస్సు వచ్చాక మనిషికి "నాలో ఎంతో మేధస్సుంది. నేను తెలివిగలవాడిని" అనే అహంకారం కనిపించకపోవచ్చు.

అలాగే మరి యుగాల తరబడి వున్న సహజ మూర్ఖత్వానికి ఒక కొత్త శోభ, కొత్త స్థాయి వస్తాయేమో! ఎందుకంటే దానిలో మన పాలూ, బియ్యం, మందుల్లోలాగా కృత్రిమం (adultration) ఏదీ లేదుగదా!

ఏఐ దూరదృష్టితో చూసి, ఎంతో సమాచారాన్ని కాచి వడపోసిన తర్వాత లెఖ్ఖలు వేసి ఆలోచిస్తుంది. మనిషి దగ్గరగానే తన కళ్ళతోనే చూసి, తను పట్టుకున్న కుందేలు మూడు కాళ్ళూ చూస్తూ దెబ్బతింటాడు.

ఏఐ కొన్ని వందల తెలుగు సినిమాలు చూసి, "ఈ కథ మళ్ళీ అదే ఫార్ములాలానే ఉంది" అంటుంది. మన మనిషి మాత్రం 'తన' హీరో ఈ సినిమాలో కొత్త చొక్కా వేసుకున్నాడని అదే సినిమా మళ్ళీ ఇంకో పేరుతో వచ్చాక కూడా, టిక్కెట్టు వెయ్యి రూపాయలకు కొనుక్కుని మూడోసారి చూస్తాడు.

సహజ మూర్ఖత్వానికి నిజానిజాలు అఖ్ఖర్లేదు. మన సినిమాల మొదట్లో మద్యం సేవించవద్దు, డ్రగ్సు తినవద్దు ఆరోగ్యం పాడవుతుంది అని చెప్పినా మన హీరో మరి తాగుతున్నాడు కదా, మానవమాత్రులం మనమూ తాగుదాం అనుకుని మందూ, డగ్సూతోపాటు పొగ కూడా తాగేస్తాడు.

రోబో ఒక వేళ తప్పు చేస్తే వెంటనే "System update required" లేదా "Please restart" అంటుంది.

మరి మనిషి తప్పు చేస్తే? "నన్ను అర్థం చేసుకునే వాడే లేదు" అంటూ ఏడుస్తాడు.

ఏఐ ట్రాఫిక్‌ని మేనేజ్ చేస్తుంది. మనిషి రాంగ్ సైడ్‌లో వెళ్తూ హారన్ కొడతాడు. సినిమాకు లేట్ అవుతోందన్నా అంటూ సమర్థించుకుంటాడు. పాపం ఏఐ మాత్రం కన్నీళ్లు పెట్టుకుంటుంది

ఏఐ ఖండాంతరాలకు మెసేజ్ పంపగలదు. మనిషి మాత్రం ఇంట్లో Wi-Fi నెమ్మదిగా ఉందని, నెత్తిన Wi-Fi రౌటర్ పెట్టుకుని సిగ్నల్ చూసుకుంటూ ఇంటా బయటా మరమనిషిలా తిరుగుతుంటాడు.

ఏఐ ఆటో డ్రైవింగ్‌తో ట్రాఫిక్‌కి నీరాజనం పలుకుతుంది. మనిషి మాత్రం జీపీఎస్ దారి చెప్పినా, తనకే జ్ఞానం ఎక్కువ అని అది కుడి వైపుకి తిరగమంటే ఎడమ వైపు తిరుగుతాడు. మరి దేవదాను కుడి ఎడమైతే పొరపాటు లేదన్నాడు కదా అని వాదిస్తాడు కూడాను. "దిశను పునఃగణన చేయండి" అంటుంది ఏఐ. అంటే తెలుగులో "ఇంకా కుడివైపు తిరగలేదా? వెంటనే తిరగరా శుంఠా" అని.

ఏఐ డేటా నుండి నేర్చుకుంటుంది. మనిషి మాత్రం బాపట్లనించీ బాబాయి, వారి మిత్రులూ పంపిన వాట్సాప్ మెసేజీలనించే నేర్చుకుంటాడు.

ఏఐ ఉపగ్రహాల సహాయంతో వాన రాదని అప్పటి వాతావరణం చెబుతుంది. కిటికీలోనించీ చేతులు బయటపెట్టి చూసి, తుమ్మెదలు ఎగురుతున్నాయి కదా వర్షం ఖచ్చితంగా వస్తుంది అంటాడు మనిషి.

కృతిమ మేధస్సు ఒక రోజు ఆత్మ జ్ఞానం పొందవచ్చు.

కానీ సహజ మూర్ఖత్వం?

దానికి ఆత్మ అజ్ఞానం జన్మత: లభించిందే మరి! ★★★★

*(మరో ముచ్చట వచ్చే నెలలో)*

COMMENTS